మహా జాతర
మన జాతర - మన మేడారం
నమస్తే తెలంగాణ
శనివారం 24 ఫిబ్రవరి 2024 వరంగల్ II




మేడారం నుంచి తిరుగుపయనమైన భక్తులతో రద్దీగా రోడ్డు





గేటు తెరువకపోవడంతో అక్కడే వేచిఉన్న మీడియా ప్రతినిధులు

## ట్రైనీ ఐపీఎస్ ఓవరాక్షన్

ములుగు, నమస్తే తెలంగాణ : జాతరలో ఓ ట్రైనీ ఐపీఎస్ శుక్రవారం ఓవరాక్షన్ చేశాడు. మీడియా పాయింట్‌కు జర్నలిస్టులు వెళ్ల కుండా అడ్డుకున్నాడు. ప్రతి జాతరప్పుడు గేట్ నుంచి పాస్‌లు ఉన్న జర్నలిస్టులను మీడియా పాయింట్‌కు పంపారు. కానీ ఈసారి ఆ గేట్ వద్ద డ్యూటీలో ఉన్న ట్రైనీ ఐపీఎస్ శుభం గేట్‌కు తాళం వేయించి పోలీసులను పెట్టాడు. చేతిలో కర్ర పట్టుకొని రెచ్చిపోయాడు. రెక్వెస్ట్ చేసినా వినిపించుకోలేదు. రెండు గంటల పాటు నిరీక్షణ, ఆందోళనతో వెనక్కి తగ్గాడు. మీడియా ఇన్‌చార్జి ఆఫీసర్, ఇన్‌స్పెక్టర్ పి.కిషన్ హుటాహుటిన చేరుకొని విషయాన్ని ములుగు ఎస్పీ శబరీశ్‌కు వాకీటాకీ సెట్‌లో తెలియజేశారు. స్పందించిన ఎస్పీ గేట్ తెరిచి పంపించండి అని ఆదేశించారు. దీంతో పోలీసులు గేట్ తాళం తీసి జర్నలిస్టులను మీడియా పాయింట్‌కు పంపారు.

## కోళ్లు, మేకల దుకాణాలు ఖాళీ

### అమాంతం ధరలు పెంచిన వ్యాపారులు
### కోడికి రూ.500, మటన్‌కు రూ.1200



మేడారంలో ఖాళీ అయిన కోళ్లు, మేకల దుకాణం

మంగపేట : మేడారంలో భక్తుల రద్దీ పెరిగిపోయి జాతర పరిసరాల్లో ఏర్పాటు చేసిన కోళ్లు, మేకల దుకాణాలన్నీ ఖాళీ అయ్యాయి. దీంతో తల్లులకు కోళ్లు, మేకలు సమర్పించి మొక్కులు చెల్లించుకునే భక్తులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. కోళ్లు, మేకల కొరతతో వీటి ధర కూడా అమాంతం పెరిగిపోయింది. ఒక్కో కోడి రూ.400 నుంచి రూ.500 వరకు, చిన్నపాటి మేక పిల్లకు రూ.8 వేల ధర పలికింది. ఇక మటన్‌కు కిలో రూ.1200 వరకు పెట్టి కొనాల్సి వచ్చిందని భక్తులు తెలిపారు. ఇంత ధర పెట్టి కొందామన్నా జాతర ప్రాంగణంలో దొరకక తాడ్వాయి, కొత్తూరు, నార్లాపురం వరకు వెళ్లాల్సి వచ్చిందని వాపోయారు.

### అన్నా.. నాకోటియ్యి



కోళ్లు తక్కువ ఉండడంతో ఎగబడి కొంటున్న భక్తులు



మేడారంలో గొర్రెపిల్లతో భక్తుడు



## బరువైనా భరిస్తూ..

కన్నాయిగూడెం : మేడారం సమ్మక్క- సారలమ్మను దర్శించుకునేందుకు భక్తులు ఎన్ని బాధలైనా ఓర్చుకుంటారు. శుక్రవారం ఓ మహిళా భక్తురాలు తన ఎత్తు బెల్లాన్ని నెత్తిన పెట్టుకొని తల్లులను దర్శనం చేసుకున్నది. బరువనిపించినా భరిస్తూ తన మొక్కును తీర్చుకున్నది.

## ఇదేం కంపు..?

ఏటూరునాగారం: మేడారం జాతర పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. కోళ్లు, మేకల వ్యర్థాలు, భక్తులు వాడిన నీళ్లు, చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. రెడ్డిగూడెం, నార్లాపూర్, స్తూపం, ఊరట్టం, వీవీఐపీ, వీఐపీ పార్కింగ్ ప్రదేశాలు, మేడారం పరిసరాల్లో కంపు వాసన వస్తోంది. భరించలేక భక్తులు ముక్కు మూసుకోవాల్సి వచ్చింది. మేడారంలోని ప్రధాన వైద్యశాల మెట్ల వద్ద వాడకం నీళ్లు చేరి రోగులు, సిబ్బంది రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కోళ్లు, మేకల వ్యర్థాలు కుళ్లిపోయి వాసన వస్తోంది. అనేక చోట్ల భక్తులు మలమూత్ర విసర్జన చేయడంతో ఈ పరిస్థితులు నెలకొన్నాయి.



చెత్తాచెదారం పక్కనే లారీ నీడన సేద తీరుతూ..



దుర్వాసన భరించలేక ముక్కుకు కొంగు అడ్డు పెట్టుకున్న మహిళలు




పేరుకుపోయిన చెత్తాచెదారం




సారలమ్మ గద్దె వద్ద భక్తజన కోలాహలం



భక్తులతో కిటకిటలాడుతున్న సమ్మక్క గద్దె ప్రాంగణం